ఓటు హక్కు.. అందరి బాధ్యత

ఎన్నికలు సజావుగా జరిగేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం

హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో 22,17,094 మంది ఓటర్లు

1944 పోలింగ్ స్టేషన్లు..807 పోలింగ్ లొకేషన్స్

మే 3, 4న వృద్ధులకు హోం ఓటింగ్ సదుపాయం

సమావేశంలో హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నియోజకవర్గంలో 22 లక్షల 17 వేల 94 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. ఇందులో 11,25,310 మంది పురుషులు, 10,91,587 మంది స్త్రీలు, కాగా, 107 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 57 మంది నామినేషన్లు దాఖలు చేయగా, స్క్రుటినీలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 19 మందిని రిజెక్ట్ చేసినట్టు వివరించారు. 8 మంది నానినేషన్‌ను ఉపసంహరించుకున్నట్టు చెప్పారు. హైదరాబాద్ పరిధిలో 1944 పోలింగ్ కేంద్రాలు, 807 పోలింగ్ లొకేషన్స్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. 85 ఏండ్లు పైబడిన ఓటర్ల కోసం హోమ్ ఓటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. హోమ్ ఓటింగ్ మే 3, 4వ తేదీలలో నిర్వహిస్తామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం బ్యాలెట్ పేపర్స్ ప్రింటింగ్ అవుతున్నట్టు చెప్పారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల కోసం 203 సెక్టోరల్ ఆఫీసర్స్‌ను నియమించామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ రజిత, తాసిల్దార్ జాహురుద్దీన్ పాల్గొన్నారు.

'నేను తప్పకుండా ఓటు వేస్తాను'

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): నగర వ్యాప్తంగా ఓటరు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ దిశానిర్దేశంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో స్వీప్ కార్యక్రమాలు చేపట్టి ఓటర్లను చైతన్యపరుస్తున్నారు. స్వయం సహాయక బృందాలు, పట్టణ మహిళా సమాఖ్యలతో, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్‌లతో సమావేశాలు నిర్వహించి తప్పనిసరిగా తమకు నచ్చిన వారికి ఓటు వేయాలని చెబుతున్నారు. ఇంటింటికీ వెళ్లి పోలింగ్ తేదీ స్టిక్కర్ వేస్తూ ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. ఓటు ప్రాధాన్యత, ఓటు హక్కు వినియోగించుకోవడంపై ఓటరు జాబితాలో తమ ఓటు ఉన్నది లేనిది ఎలా చెక్ చేసుకోవాలి? పోలింగ్ బూత్ తెలుసుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించి ఓటరుతో ప్రతిజ్ఞ చేయిస్తూ, ఇంటింటికీ వెళ్లి మే 13న ఓటు వేయాలని స్టిక్కర్ వేస్తూ ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. విక్రంపురి, కార్ఖానా మెయిన్ రోడ్, బాషా షోరూం, వాసే బేకరీ, రిలయన్స్ షోరూం, న్యూ అశోక్‌నగర్, పార్సీగుట్ట, సంజీవపురం, టయోటా షోరూం, లంగర్‌హౌజ్, బాపూ ఘాట్ ఎస్‌బీఐ, నెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్, టోలీచౌకి, మెట్టుగూడ, బౌద్ధనగర్ తదితర ప్రాంతాలలో 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అన్న నినాదంతో ప్రజలతో ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

బాబూజీ మహరాజ్ జయంతిలో పాల్గొన్న అభ్యాసకులు

బాబూజీ మహరాజ్ సందేశం ఎంతో విలువైంది

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): బాబూజీ మహరాజ్ సందేశం ఎంతో విలువైందని, దాన్ని తెలుసుకొని అందరూ పాటించాలని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. నగర శివారులోని కన్హా శాంతి వనంలో బాబూజీ మహారాజ్ 125వ జయంత్యుత్సవాల్లో భాగంగా ఆయన స్మారక నాణేలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక నాయకుడిగా ఆయన ప్రగాఢ వారసత్వాన్ని గౌరవించడానికి ఇక్కడకు వచ్చానని, బాబూజీ మహరాజ్ లక్ష్యాన్ని ప్రస్తుతం దాజీ ముందుకు తీసుకువెళుతున్నారని అన్నారు. ప్రపంచం నలుమూలల నుంచి కన్హా శాంతి వనాన్ని సందర్శించడం వల్ల అభ్యాసకులంతా ప్రయోజనం పొందేలా ఇక్కడ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. 2024లో హార్ట్‌ఫుల్‌నెస్ ఉద్యమాన్ని దాజీ ఎంతో విజయవంతంగా ముందుకు తీసుకువెళుతున్నారన్నారు. శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షులు, హార్ట్‌ఫుల్‌నెస్ గైడ్ దాజీ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక పరిణామమే మానవ జీవితానికి అంతిమ లక్ష్యం అని అన్నారు. రెండో రోజు కార్యక్రమంలో 'ప్రమ్ దాజీ.. విత్ లవ్' పేరుతో తెలుగు, ఇంగ్లిషులలో రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని, అదే విధంగా స్మారక నాణేలను విడుదల చేశామన్నారు.

నీటి కొరత, విద్యుత్ సమస్యలపై స్పందనేది?

ఓయూ పరిణామాలపై విద్యార్థి లోకం ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 30: ఉస్మానియా యూనివర్సిటీలో నీటి ఎద్దడి, విద్యుత్ కొరత నేపథ్యంలో నెలరోజులు వేసవి సెలువులు ప్రకటిస్తున్నట్లు చీఫ్ వార్డెన్ ఉత్తర్వులు జారీ చేయడం, తదనంతర పరిణామాలపై విద్యార్థి లోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఉత్తర్వుల జారీకి రెండు రోజుల ముందు తాగునీరందడం లేదని లేడీస్ హాస్టల్ విద్యార్థినులు ధర్నా చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. వారం నుంచి తాము సమస్య ఎదుర్కొంటున్నా అధికారులు పరిష్కరించలేదని విద్యార్థినులు రాత్రి సమయంలో ఆందోళన చేపట్టారన్నారు. మానేరు హాస్టల్‌లోనూ తాగునీటి సమస్యపై ఆ హాస్టల్ విద్యార్థులు చీఫ్ వార్డెన్ ఆఫీస్‌లో సోమవారం నిరసన తెలిపారన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి, నీటి ఎద్దడి, విద్యుత్ కొరత లేకుండా చూసుకోవాల్సింది పోయి, అనవసర రాజకీయాలు చేస్తున్నారని మండిపడుతున్నారు. విద్యార్థుల కోసం ప్రత్యేకమైన గ్యారెంటీగా హామీ ఇచ్చిన యువ వికాసం పథకం జాడే లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఒక గ్యారెంటీ అయిన రుణమాఫీ మాత్రమే పెండింగ్‌లో ఉందని, దానిని ఆగస్టు 15వ తేదీలోగా పూర్తి చేస్తామని హామీ ఇస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి యువ వికాసం పథకం గురించి మర్చిపోయారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రభుత్వం నీచ రాజకీయాలకు తెరలేపిందని దుయ్యబట్టారు.

ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

అటవీ సంరక్షణ ఎప్పటికీ సవాలే..

తెలంగాణ అటవీ శాఖ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు

శిక్షణ పూర్తి చేసుకున్న బీట్ అధికారికి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న అటవీ శాఖ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు, తదితరులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 30: కాలాన్ని బట్టి అటవీ శాఖ పాత్ర మారుతుందని తెలంగాణ రాష్ట్ర అటవీ సంరక్షణాధికారి ఎల్యూసింగ్ మేరు తన అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ దూలపల్లిలో 34వ బ్యాచ్ అటవీ అధికారుల ప్రవేశ శిక్షణా కార్యక్రమ స్నాతకోత్సవం మంగళవారం జరిగింది. ఇందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేడు అటవీ రక్షణ, భూముల సంరక్షణ సవాళ్లుగా మారాయన్నారు. ఈ శిక్షణ అందించిన జ్ఞానం, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసంతో శిక్షణాధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలతో పాటు అటవీ, వన్యప్రాణి రక్షణలో పని చేయాలన్నారు. కొత్త విషయాలు నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కోర్టులో పేరుకుపోయిన అటవీ కేసులను త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు. అంతకు ముందు బీట్ అధికారుల కోర్స్ డైరెక్టర్ పీవీ రామకృష్ణ, బీటు అధికారుల శిక్షణ రిపోర్టును సమర్పించారు. శిక్షణ కార్యక్రమం అంతిమ పరీక్షలలో బీటు అధికారులలో 53 ఆనర్స్ శ్రేణిలో, 31 మంది ఉన్నత శ్రేణిలో మిగతా వారు దిగువ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. కామారెడ్డి అటవీ డివిజన్‌కు చెందిన బి.శేఖర్ నాలుగు బంగారు పతకాలను సాధించారు. టి.రాకేశ్, సి.చంద్రశేఖర్ ఒక్కొక్కరు రెండు పతకాలు, బి.విజయ్ కుమార్, జె.శ్రీవల్లి, ఎం.ప్రదీప్, యు.నాగార్జున్, బి.రవి ఒక్కొక్క బంగారు పతకాన్ని సాధించారు. మారథాన్ పరుగు పందెంలో మహిళా విభాగంలో ఎన్.సంతోషి, పురుషుల విభాగంలో డి.రమేశ్ పతకాలను సాధించారు. ఈ కార్యక్రమంలో అటవీ అకాడమీ సంచాలకులు ఎస్‌జే ఆషా, విశ్రాంత అటవీ అధికారులు ప్రదీప్, కిషన్, రవీందర్‌లతో పాటు ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలు

తెలుగు యూనివర్సిటీ, ఏప్రిల్ 30: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022వ సంవత్సరానికి గాను సాహితీ పురస్కారాలను ప్రకటించింది. పద్య కవితా ప్రక్రియలో పెండ్యాల కిషన్ శర్మ (శ్రీ వరదాభ్యుదయము), వచన కవితా ప్రక్రియలో మెర్సీ మార్గరేట్ (కాలం వాలిపోతున్న వైపు), బాల సాహిత్యంలో ఎన్నవెళ్లి రాజమౌళి (ఆటా-పాటా), కథానిక ప్రక్రియలో కొట్టం రామకృష్ణారెడ్డి (నూనె సుక్క), నవలా ప్రక్రియలో డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మ (కెరటం), సాహిత్య విమర్శలో ఆచార్య వెల్దండ నిత్యానందరావు (అనుభూతి-అన్వేషణ), నాటకం, నాటిక ప్రక్రియలో పీఏ దేవి (స్వాతంత్రోద్యమ వీరుల నాటక త్రయం), అనువాద సాహిత్యంలో గురుమూర్తి గుబిలి(వీరయ్య), వచనల విభాగంలో సయ్యద్ నజీర్ అహమ్మద్ (ఆజాద్ హింద్ ఫౌజ్-ముస్లిం పోరాట యోధుల), రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో దాగంటి తులసి (రంగంటే ఇష్టం) గ్రంథాలు సాహితీ పురస్కారానికి ఎంపికైనట్లు వీసీ టి.కిషన్ రావు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం

బీజేపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఏప్రిల్ 30: బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజలకు సంక్షేమమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం బీజేపీ నుంచి వచ్చిన నాయకులకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చలేదన్నారు. జన్ ధన్ బ్యాంక్ ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి హామీలతో ప్రజలను ఊదరగొట్టారని, చివరకు బ్యాంకులలో డబ్బులు వేయలేదన్నారు. బీజేపీ అభ్యర్థి రాజేందర్ మల్కాజిగిరి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలను అమలుపరిచిందిని అన్నారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరడం హర్షణీయమని, వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించడానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కౌశిక్, వంశీ, నితిన్, రాజేశ్, శ్రీధర్, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

పోస్టు కార్డుల పంపిణీ: డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి

నారాయణపూర్ గ్రామంలో పోస్టు కార్డుల ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

శామీర్‌పేట, ఏప్రిల్ 30: రైతు సమస్యలు పట్టించికోని కాంగ్రెస్ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. మూడు చింతలపల్లి మండలం నారాయణపూర్ గ్రామంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం పోస్టు కార్డులో నిరసన వ్యక్తం చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం పోస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా లేని కారణంగా రైతాంగం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చడంతో పాటు రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులను సమస్యలను పట్టించుకోకుండా రైతు వ్యతిరేకిగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుదామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు గౌస్ పాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాంచంద్రయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, జహంగీర్, లక్ష్మీనారాయణ, విష్ణు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడే మేడే..

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌లో భారతీయ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు కార్మిక దినోత్సవం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులందరు ఈ సమావేశంలో పాల్గొంటారని బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ, ఏప్రిల్ 30: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. కాచిగూడలో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ, సైబర్ సెక్యూరిటీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ ఆర్కిటెక్ట్, ఐటీ సెక్యూరిటీ విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీర్, పాలిటెక్నిక్, డిప్లమా యువకులు ఈ నెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నం: 78931 41797లో, ఆన్‌లైన్‌లో www.nacsindia.org లో సంప్రదించవచ్చని ఆమె కోరారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్షలతో పాటు ఎం. ఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.

బీఈ కోర్సు పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు రాములు తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్ పరీక్షా ఫీజును ఈ నెల 8వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 13వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వన్‌టైం ఛాన్స్ పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. 2001 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిస్తున్నట్టు పేర్కొన్నారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్షా ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

ఐఐసీటీలో ఉద్యోగావకాశాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 30(నమస్తే తెలంగాణ): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. రీసెర్చ్ అసోసియేట్‌తో పాటు, సీనియర్ ప్రాజెక్టు అసోసియేట్, జూనియర్ రీసెర్చ్ ఫెలో, ప్రాజెక్టు అసోసియేట్ పోస్టులను భర్తీ చేసేందుకు మే 1, 2వ తేదీల్లో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లుగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కెమిస్ట్రీతో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ, బీ టెక్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు కాగా, సంబంధిత పోస్టులకు కావాల్సిన ఇతర వివరాలను ఐఐసీటీ కెరీర్‌లో పొందుపరిచినట్లుగా వెల్లడించారు.

ఎస్సెస్సీ ఫలితాలలో భాష్యం విజయభేరి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 30: తెలంగాణ ఎస్సెస్సీ-2024 ఫలితాలలో భాష్యం విద్యార్థులు తమ సత్తా చాటారు. మంగళవారం విడుదలైన ఫలితాలలో 264 మంది భాష్యం విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి చరిత్ర సృష్టించారు. 502 మంది విద్యార్థులు 9.8 జీపీఏ ఆ పైగా, 717 మంది 9.7 జీపీఏ ఆ పైగా, 905 మంది 9.5 జీపీఏ ఆపైగా, 1492 మంది విద్యార్థులు 9 జీపీఏ ఆపైగా సాధించగా, మొత్తం 11,201 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్‌లు కైవసం చేసుకున్నారు. మ్యాథ్స్‌లో 1556 మంది, సైన్స్‌లో 1920 మంది ఏ గ్రేడ్‌లతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా భాష్యం జోనల్ హెడ్ బి.అంకమ్మ రావు మాట్లాడుతూ, తెలంగాణ ఎస్సెస్సీ ఫలితాలలో భాష్యం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారన్నారు. విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే ఇలాంటి అద్భుత విజయాలు సాధించగలిగామన్నారు. విద్యా విధానంలో సమగ్ర ప్రణాళికలతో భాష్యం జైత్రయాత్ర ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావులు అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీఈఓ చైతన్య, జెడ్ఈఓలు శిరీష, మార్కండేయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సెస్సీలో శ్రీ చైతన్య విజయ దుందుభి

జూబ్లీహిల్స్,ఏప్రిల్30ః తెలంగాణ ఎస్సెస్సీ-2024 ఫలితాలలో శ్రీ చైతన్య స్కూల్స్ నుంచి 1402 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించి విజయఢంకా మోగించారని శ్రీ చైతన్య స్కూల్స్ డైరెక్టర్ సీమ తెలిపారు. 2,803 మంది విద్యార్థులు 9.8 జీపీఏ ఆ పైన, 5207 మంది 9.5 జీపీఏ ఆ పైన, 8216 మంది విద్యార్థులు 9.0 జీపీఏ ఆపైన సాధించారని తెలిపారు. శ్రీ చైతన్య స్కూల్ ఓవరాల్ జీపీఏ 10కి గాను 9.2 ఓవరాల్ పాస్ పర్సంటేజ్ 99.2 గాను ఉన్నట్లు ఆమె చెప్పారు. 100 శాతం విద్యార్థులు పాసైన బ్రాంచీల సంఖ్య 84 అని, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో 17,913 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్ సాధించారన్నారు. కాగా, శ్రీ చైతన్య స్కూల్స్ 10/10 జీపీఏ సాధించిన 1402 మంది విద్యార్థుల సంఖ్య మరే ఇతర విద్యా సంస్థల దరిదాపుల్లోకి కూడా లేదని ఆమె స్పష్టం చేశారు. గ్రేడ్ పాయింట్స్ అయినా, మార్కులైనా పదో తరగతి ఫలితాలలో రాష్ట్రం ఏదైనా ఎల్లప్పుడూ శ్రీ చైతన్యే నం.1 స్థానంలో నిలుస్తుందని సీమ తెలిపారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ టీచింగ్ మెథడాలజీ, సీ-ఐపీఎల్, ఎంపీఎల్, ఐకాన్, సీ-బ్యాచ్, సివిల్స్, మెడికావై మరియు టెక్నో వంటి పటిష్టమైన అకాడమిక్ ప్రోగామ్స్, మైక్రో లెవల్ టీచింగ్ సిస్టంతో పాటు అంకిత భావంతో పనిచేసే అధ్యాపకుల వలన మాత్రమే ఇలాంటి అద్భుత ఫలితాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. కాగా, 2023లో ఐఐటీ-జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో ఫస్ట్ ర్యాంకులు సాధించిన వారు శ్రీ చైతన్య విద్యార్థులేనని ఆమె గుర్తు చేశారు. ఇంతటి అనితర సాధ్యమైన విజయానికి కారణమైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి శ్రీ చైతన్య స్కూల్స్ డైరెక్టర్ శ్రీమతి సీమ అభినందనలు తెలిపారు.

ఎస్సెస్సీలో త్రివేణి విజయఢంకా

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 30: తెలంగాణ ఎస్సెస్సీ-2024 ఫలితాలలో మూడు దశాబ్దాలుగా తిరుగులేని విధంగా త్రివేణి విద్యార్థులు టాప్ గ్రేడ్‌లను సాధించి ప్రతిభ చాటారు. ప్రగతి ఫలాల తెలంగాణలో ప్రభంజన ఫలితాల త్రివేణి సంచలన రికార్డు సాధించింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన పదో తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యార్థులు విజయ దుందుభి మోగించారని త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. త్రివేణి అన్ని బ్రాంచీలలో 71 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారని, ఇది గతంలో కంటే ఎక్కువగా ఉందన్నారు. 149 మంది విద్యార్థులు 9.8 జీపీఏ, 227 మంది విద్యార్థులు 9.7 జీపీఏ, 538 మంది విద్యార్థులు 9.0 జీపీఏ సాధించారన్నారు. అలాగే, మ్యాథ్స్‌లో 642 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్‌లను, సైన్స్‌లో 732 మంది విద్యార్థులు, సోషల్‌లో 789 మంది విద్యార్థులు, 'ఏ' గ్రేడ్‌లు సాధించారన్నారు. మొత్తంగా 4339 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్‌లు సాధించారని తెలిపారు. అలాగే అత్యధిక బ్రాంచ్‌లలో 100 శాతం పాస్ పర్సంటేజ్‌తో మరోసారి తెలంగాణలో నం.1గా త్రివేణి నిలిచిందన్నారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణం